క్లుప్తంగా

అమలేశ్వరీదేవిని దర్శించుకున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



పెడన: మండలంలోని దావోజిపాలెంలో ఉన్న శ్రీఅమలేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని గురువారం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలసి దర్శించుకున్నారు. వారితో పాటు టీడీపీ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), పెడన జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల కౌంటర్‌ను పరిశీలించిన డీఎస్‌వో



మచిలీపట్నంటౌన్: రైతుబజారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల కౌంటర్‌ను డీఎస్‌వో వి.పార్వతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను నియంత్రించటంలో భాగంగా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో రైతుబజారులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. టమాటా కిలో రూ.50, పామాయిల్ రూ.114, సన్‌ఫ్లవర్ రూ.124 లకు విక్రయించేలా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ అమీర్, బృందావనపుర హోల్‌సేల్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి జల్లూరి గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన సబ్‌జడ్జి



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల, సీమాక్ కేంద్రాన్ని గురువారం సబ్ జడ్జి బాలు నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల వార్డులను పరిశీలించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వసతులు, గదుల శుభ్రతను పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, ఇతర వైద్యులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు సత్వర వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



నాగాయితిప్ప(మోపిదేవి): గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని నాగాయితిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం విజయవాడ హెల్ప్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హెల్ప్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ జ్వాలాసాయి తెలిపారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్ ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేస్తామని వివరించారు.

అందరి సమన్వయంతోనే సుపరిపాలన



ఘంటసాల: అందరి సమన్వయంతోనే ప్రజలకు సుపరిపాలన అందించవచ్చునని ఘంటసాల ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న మండల స్థాయి గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ తమ పరిధిలో ప్రజలకు ఎదురయ్యే తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను పాలకవర్గ సమన్వయంతో పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలు సక్రమంగా పని చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. పంచాయతీలకు ఆదాయం ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు వారి పరిధిలో విధులు, నిధులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన పాలకవర్గ సభ్యులకు సర్టిఫికెట్లు అందించారు.

నిర్వహణాలోపంతో నిరుపయోగం

- ఆదరణకు నోచుకోని టీటీడీ కల్యాణ మండపం
- అపరిశుభ్రంగా గదులు
- బురదకయ్యగా ఆవరణ
- నెరవేరని దాతల ఆశయం

బంటుమిల్లి: బంటుమిల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు(టీటీడీ) నిర్మించిన కల్యాణ మండపం సరైన సౌకర్యాలు, శుభ్రమైన వాతావరణం, ఆదరణ లేక వెలవెలపోతోంది. దాతలు ఇచ్చిన స్థలంలో గ్రామంలో కల్యాణ మండపం నిర్మించి దాదాపు 20 సంవత్సరాలు అవుతోంది. స్థానికంగా సరైన కల్యాణ మండపాలు లేక స్థానికులు అప్పట్లో బాగానే ఆదరించారు. బంటుమిల్లిలో ఇటీవల ఏసీ కల్యాణ మండపాలు రావడంతో టీటీడీ కల్యాణ మండపంకు క్రమేపీ ఆదరణ కొరవడింది. దీనికి తోడు టీటీడీవారు కూడా నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టరుకు అప్పగించి చేతులు దులుపుకొంది.

కొరవడిన సౌకర్యాలు

సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించిన టీటీడీ కల్యాణ మండపంలో కల్యాణాలు చేసుకునేందుకు హాలు, భోజనశాల, వంట గది మాత్రమే ఉన్నాయి. మిగిలిన ఆవరణ అంతా ఇన్ని సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోక వర్షాకాలం నీటితో బురదకయ్యగా చెరువును తలపిస్తుంది. దీనికితోడు నిర్వాహకులకు వాహనాలు నిలుపుకొనేందుకు సౌకర్యాలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన నీటి సౌకర్యం లేకపోవడం కూడా ఇబ్బందులు కలిగిస్తోంది.

అపరిశుభ్రంగా గదులు, వాష్‌రూమ్‌లు

టీటీడీ కల్యాణ మండపంలోని గదులు గాని, వాష్ రూములు గాని అపరిశుభ్రంగా ఉంటున్నాయి. పెళ్లికుమార్తె, పెళ్లికుమారుడు గదుల్లో ఉన్న మంచాలు, పరుపులు దిండ్లు మరకలతో అపరిశుభ్రంగా ఉంటాయి. వంట గది, బల్లల సంగతి ఇక చెప్పనవసరం లేదు. కిటికీలు, తలుపుల అద్దాలు పగిలిపోయి దుమ్ముధూళితో లోపలంతా టూరింగ్‌టాకీసును తలపిస్తుంది. అద్దె తక్కువగా ఉన్నా ప్రజల నుంచి పెద్దగా ఆదరణ లేదు. గేటు ముందు ఆవరణ మందుబాబులకు సిటింగ్ రూముగా తయారైంది. దీనిని కాంట్రాక్టు తీసుకున్న విజయనగరం ప్రాంతానికి చెందిన పాండురంగారావు మాట్లాడుతూ ఒక సంవత్సరానికి రూ.2 లక్షలు అద్దె చెల్లించాలని ముందుగా అడ్వాన్స్ చెల్లించి తీసుకున్నట్టు చెప్పారు. అద్దె ఖర్చులు కూడా రావడంలేదని వాపోయారు. ఈ ఏడాది కేవలం రెండు కార్యక్రమాలు మాత్రమే చేశామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే సొంత ఖర్చులతో పలు రకాల పనులు చేయించానని కాంట్రాక్టు ఇంకో సంవత్సరం ఉందన్నారు. టీటీడీ అధికారులు స్పందించి కల్యాణ మండపం చేర్పులు, మార్పులు చేసి ఏసీలు బిగించి ఆవరణ అంతా శుభ్రం చేసి ప్రజలు ఆదరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బంటుమిల్లిలో ఉన్న టీటీడీ కల్యాణ మండపం



అపరిశుభ్రంగా ఉన్న పెళ్లికుమారుని గదిలోని పరుపు, దిండ్లు



వంటగది దుస్థితి ఇది...

త్వరలో మోపిదేవి పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయి సేవలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

మోపిదేవి: మోపిదేవి పోలీస్‌స్టేషన్ నుంచి త్వరలోనే పూర్తిస్థాయిలో సేవలు అందిస్తామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇప్పటివరకు చల్లపల్లి స్టేషన్ లోనే కేసులు నమోదు చేస్తున్నారని, ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే పూర్తిస్థాయిలో మోపిదేవి పోలీస్ స్టేషన్ నుంచి అన్ని రకాల సేవలు అందిస్తామన్నారు. గజిట్ నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉందని, దానికి కావలసిన సమాచారం కూడా పంపామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే తగిన సిబ్బందిని ఏర్పాటు చేస్తామని వివరించారు. ఐజీ వెంట కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

నాగాయలంక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఐజీ

నాగాయలంక: ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్ గురువారం నాగాయలంక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలసి స్టేషన్ రికార్డులు తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి స్టేషన్ రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, చిన్నారులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రికార్డులకు సంబంధించిన సమాచారాన్ని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం, ఫిర్యాదుల స్వీకరణలో అలసత్వంపై ఐజీ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



నాగాయలంక స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసిన ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు

జిల్లాలో టెట్ పరీక్ష ప్రశాంతం

పెడన: జిల్లాలో టెట్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఉదయం రెండు కేంద్రాలు, మధ్యాహ్నం మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల, పెనమలూరు మండలం కానూరులో అయాన్(ఐఓఎన్) డిజిటల్ జోన్, వంద అడుగుల రోడ్డులోని ఐడ్జ్(ఐడీజడ్)లో సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో రెండు పరీక్ష కేంద్రాల్లో 370 మందికి గాను 306 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్లో మూడు పరీక్ష కేంద్రాల్లో 1,337 మందికి గాను 1,128 మంది హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈవో కార్యాలయం ఏడీ మనోహర్ నాయక్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



నందమూరు టెట్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

రతన్‌టాటా మరణం తీరనిలోటు

మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ

చిలకలపూడి(మచిలీపట్నం): టాటా గ్రూప్స్ చైర్మన్ రతన్‌టాటా మరణం వ్యక్తిగతంగా తనకు తీరనిలోటని మచిలీపట్నం పార్లమెంట్ మాజీ సభ్యుడు బాడిగ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. రతన్‌టాటా తనకు ఎంతో ఆత్మీయులని, వ్యాపారాభివృద్ధిలో ఎంతో సహాయసహకారాలు అందించారన్నారు. ఆయన మరణ వార్త తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. రతన్‌టాటా మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన చూపిన మార్గం, సేవాతత్పరతతో ముందుకు వెళతామన్నారు.

రతన్ టాటా చిరస్మరణీయుడు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నిస్వార్థ సేవకుడు, వ్యాపార దిగ్గజం రతన్ టాటా చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఆకట్టుకున్న దేవీతత్వం ప్రవచనం



మచిలీపట్నంటౌన్: శ్రీ దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమంలో గురువారం ప్రముఖ ప్రవచనకర్త సింగరాజు దివాకర్లు దేవీతత్వంపై చేసిన ప్రవచనం ఎంతగానో ఆకట్టుకుంది. దత్తాశ్రమంలో ఏర్పాటు చేసిన వారాహి అమ్మవారి ప్రతిమను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని పూజించారు. సాయంత్రం దివాకర్లు చేసిన ప్రవచనాన్ని ఆసక్తిగా విన్నారు. ఆజాద్‌రోడ్డులోని గీతామందిరంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు గీతామందిరం కార్యదర్శి మామిడి వేణుగోపాలరావు బహుమతులు అందజేశారు.



నాగాయలంక: నగరేశ్వరుని సన్నిధిలో శ్రీదుర్గాదేవిగా...



పెడన: శ్రీదుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కృత్తివెన్ను: అడ్డపర్ర గ్రామంలో దుర్గాదేవి అలంకారంలో...



అవనిగడ్డ: శివాలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

శక్తి స్వరూపిణీ జై కనక దుర్గా!

శ్రీదేవీ నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజు వివిధ ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. –సాక్షి నెట్‌వర్క్



గూడూరు: తరకటూరులో దుర్గాదేవిగా..



బంటుమిల్లి: ముంజులూరులో దుర్గాదేవిగా...



మోపిదేవి: పెదకళ్లేపల్లిలో దుర్గాదేవిగా...



కోనేరుసెంటర్: మచిలీపట్నంరూరల్ మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

నకిలీ పురుగుమందులు వాడిన పంటల పరిశీలన

గుంటూరు లాంఫామ్ నుంచి వచ్చిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాక్షి ఎఫెక్ట్

పెడన: నకిలీ పురుగుమందు వాడిన రైతుల పంటలను గురువారం గుంటూరు లాంఫామ్‌లోని వ్యవసాయశాఖ సైన్సు లాబ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండల పరిధిలోని జింజేరు గ్రామ రైతులు నకిలీ పురుగుమందులు వాడి పంట నష్టపోయిన విషయమై ఈ నెల 6వ తేదీన 'సాక్షి'లో 'నట్టేట ముంచిన నకిలీ' అంటూ కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసాతో పాటు డీఏవో కార్యాలయం టెక్నికల్ అసిస్టెంట్ సి.శాంత జింజేరు గ్రామంలో పర్యటించి నకిలీ పురుగుమందు వినియోగించిన రైతుల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నివేదికలను జిల్లా అధికారులకు అందజేశారు. దీనిపై శాస్త్రవేత్తలను పంపించి పరిశీలించేలా చూడాలని నివేదికను పైకి పంపించడంతో గురువారం లాంఫామ్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి, డాక్టర్ ఎస్.సాంబశివరావు, మచిలీపట్నం శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు నకిలీ పురుగుమందు వినియోగించిన పంట పొలాలను పరిశీలించారు. వీరితో పాటు మచిలీపట్నం డీఏవో కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ మనోహరరావు, పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా ఉన్నారు. రైతులు ఎవరి వద్ద ఎటువంటి పురుగుమందు కొనుగోలు చేసింది, దానిని ఎలా వినియోగించిందీ తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ విషయమై పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అన్ని విషయాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకుని రిపోర్టును జిల్లా అధికారులకు తెలియజేస్తామని చెప్పారన్నారు.



నకిలీ పురుగుమందు వాడిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రధాన రహదారులకు మోక్షం కలిగేనా?



తాడేపల్లి వద్ద అధ్వానంగా మారిన రోడ్డు



భారీ గుంతలతో ఘంటసాల - మల్లంపల్లి రహదారి

- ఘంటసాల– కొడాలి రోడ్డు ఎప్పుడు వేస్తారో!
- రూ.1.20 కోట్లు మంజూరైనా ముందుకు సాగని ఘంటసాల – మల్లంపల్లి రోడ్డు

ఘంటసాల: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఘంటసాల మండలం నుంచి వెళ్లే ప్రధాన రహదారులన్నీ అభివృద్ధి చేస్తామని ఎన్నికలలో కూటమి అభ్యర్థి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో చైతన్య రథం బస్సు యాత్రలో భాగంగా ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామం వద్ద తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా నేటికీ ఘంటసాల మండలంలోని ప్రధాన రహదారులను పట్టించుకున్న పాపానపోలేదు. ఘంటసాల నుంచి మల్లంపల్లి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్లు మంజూరు

ఘంటసాల కాజ వయా మల్లంపల్లి రోడ్డుకు 2021లో రూ.10 లక్షలతో మరమ్మతులు చేపట్టగా, పూర్తి స్థాయి రోడ్డు వేసేందుకు 2023లో ఏఎంసీ, నాబార్డు ద్వారా రూ.1.20 కోట్లు మంజూరు అయ్యాయి. వీటితో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.10.50 లక్షలు మంజూరు కాగా టెండర్ల దశలో ఉన్నాయి. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో అప్పుడు పనులు నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను రద్దు చేయడంతో ప్రస్తుతం మల్లంపల్లి రోడ్డుకు మంజూరైన రూ.1.20 కోట్లు నిధులు రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.10.50 లక్షలు మాత్రం అలాగే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నేతలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళకు కౌన్సెలింగ్

కోనేరుసెంటర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పూనుకున్న ఓ మహిళకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి క్షేమంగా ఇంటికి పంపారు. ఈ ఘటన మంగినపూడి బీచ్ వద్ద గురువారం జరిగింది. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంలోని పాత రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న బి.శాంతి, కిరణ్‌కుమార్ భార్యభర్తలు, వీరికి మూడు నెలల పాప ఉంది. గత కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య ఘర్షణ జరుగుతున్న నేపథ్యంలో మనస్తాపానికి గురైన శాంతి గురువారం పాపతో కలిసి మంగినపూడి బీచ్‌కు వెళ్లి బిడ్డతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. పసిబిడ్డను చూసుకుంటూ బీచ్ ఒడ్డున కుమిలిపోతూ ఏడుస్తుండగా అనుమానం వచ్చిన ఓ ఫొటోగ్రాఫర్ బీచ్ వద్ద డ్యూటీలో ఉన్న మెరైన్ పోలీసులకు విషయం చెప్పాడు. దీంతో ఎస్ఐ పరింకాయల మురళీకృష్ణ, కానిస్టేబుల్ అప్పారావు, హోంగార్డు స్వామి కలిసి బాధితురాలి వద్దకు వెళ్లి ఆమె బాధను అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించారు. బాధితురాలు తన బాధను చెప్పుకునేందుకు అంగీకరించకపోగా బీచ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్ఐ మురళీ ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్య ఏదైనా పరిష్కరించటానికి తామున్నామంటూ భరోసా ఇచ్చారు. దీంతో ఆమె తన బాధను చెప్పుకుని భోరున విలపించింది. ఎస్ఐ మురళీ ఆమె భర్తతో మాట్లాడి ఇరువురికీ సర్ది చెప్పి ఆమెతో పాటు పసిబిడ్డను సురక్షితంగా అప్పగించారు. పర్యాటకులు మెరైన్ పోలీసులను అభినందించారు.



బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి బయటకు తీసుకువస్తున్న మెరైన్ పోలీసులు

పాత వారు కూడా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి

పెడన: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటరు జాబితాలోని పాత వారు కూడా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందేనని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పట్టభద్రుల ఓటరు జాబితాలోని వారు తాజా ఓటరుగా నమోదు చేసుకుంటేనే రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసేందుకు ఓటు హక్కు పొందుతారని తెలిపారు. ఏదైనా డిగ్రీ 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి పూర్తి చేసి ఉండాలన్నారు. డిగ్రీ యే కాకుండా ఏదైనా తత్సమాన అర్హత ఉన్న వారు కూడా ఓటరుగా నమోదుకు అర్హులేనన్నారు. దరఖాస్తు ఫారాలు పెడన నియోజకవర్గంలోని అన్ని తహసీల్దారు కార్యాలయాల్లోను, మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తును పూర్తి చేసి డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై గెజిటెడ్ ర్యాంకు అధికారి సంతకం అటెస్టెడ్ చేయించాలన్నారు. దీంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, అసెంబ్లీ ఓటరు గుర్తింపు కార్డు నకళ్లను జతజేసి ఆయా కార్యాలయాల్లో అందజేయాలని ఆయన పేర్కొన్నారు. నవంబరు ఆరో తేదీలోగా అర్హులైన ప్రతి ఒక్కరూ కూడా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఘంటసాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సురేష్ కోరారు. ఘంటసాల సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగులకు అసోసియేషన్ పక్షాన ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చెరుకూరి శ్రీనివాసరావు, మేరుగు వేణుగోపాలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సయ్యద్ పీర్ సేవలు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రాంతంలో నేత్ర వైద్యసేవలకు సయ్యద్ పీర్ చేస్తున్న కృషి అభినందనీయమని అవేర్ ఆసుపత్రి వైద్యుడు నేతి ప్రభాకర్ అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం స్థానిక శివగంగలోని స్వాతి స్కూల్‌లో అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆప్తమాలిక్ టెక్నీషియన్ సయ్యద్ పీర్‌ను సత్కరించారు.